క్లుప్తంగా

బీజేపీ పటిష్టతకు కృషి చేయాలి



ఎంపీ అర్వింద్‌ను కలిసిన బీజేపీ నాయకులు

రాయికల్: మండలంలో బీజేపీ పార్టీ పటిష్ట తకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. శనివారం రాయికల్ మండలం ఆలూరు శివాజీరెడ్డి సంఘం నాయకులు ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, ప్రధానిగా నరేంద్రమోడీని చేయడం, రాష్ట్రంలో కేసీఆర్‌ను గద్దె దించడమే మన కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు భోగ ప్రవీణ్, రెడ్డి సంఘం అధ్యక్షుడు సురతాని మల్లారెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, మల్లారెడ్డి, తిరుపతి, రాంరెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు సన్మానం



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

కథలాపూర్: రాష్ట్ర వ్యవసాయ రంగ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన ఎమ్మెల్యే రమేశ్‌బాబును శనివారం కథలాపూర్ మండల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి నాయకులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు బాలు, వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ సోమ దేవేందర్ రెడ్డి, కో ఆప్షన్‌సభ్యుడు ఎం.డీ రఫీ,నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబురాలు

ఎమ్మెల్యే రమేశ్‌బాబును వ్యవసాయ రంగ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులు కావడంతో మేడిపల్లిలో శనివారం బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు సంబురాలు జరుపుకున్నారు. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపి, ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ రమ్య, వైస్‌చైర్మన్ లింగారెడ్డి, సర్పంచులు సంపత్‌కుమార్, అభిలాష్, ఎంపీటీసీలు అంకం వినోద, మకిలి దాస్, పాల్గొన్నారు.

విద్యార్థులకు మాక్ అసెంబ్లీ



మాక్ అసెంబ్లీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కోరుట్ల: పట్టణంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. అసెంబ్లీలో సీఎం, మంత్రుల విధులు, బాధ్యతలు, ప్రతిపక్షాలతో ప్రజలకు ఉపయోగపడే అంశాలపై చర్చలు ఏలా జరుగుతాయన్న అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అసెంబ్లీ నిర్ణయాల మేరకు చట్టాల రూపకల్పన వాటి అమలు తీరుతెన్నులపై విద్యార్థులతో ప్రదర్శన చేయించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్వేత, పోతుగంటి లక్ష్మీనారాయణ, లెక్చరర్లు శ్రవణ్, వెంకటేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలే ఆధారం



మొక్కలు నాటుతున్న సీఐ, ఎస్సై

మల్యాల: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని, మానవ మనుగడ మొక్కల సంరక్షణపై ఆధారపడి ఉందని మల్యాల సీఐ బిల్లా కోటేశ్వర్ అన్నారు. మల్యాల పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్సై తీగల అశోక్‌తో కలిసి సీఐ కోటేశ్వర్, వివిధ గ్రామాల్లో ఎంపీడీవో వెంకటేశం, ఎంపీపీ వాసవి సర్పంచులు శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఐ కోటేశ్వర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై కృష్ణ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆసం శివ, సర్పంచ్ పొన్నం సరోజన, ఉప సర్పంచ్ పోతరాజు శ్రీనివాస్,ఎడిపెల్లి రాజన్న, శనిగరపు తిరుపతి, అటవీ శాఖ అధికారులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేలు సరే.. పరిహారం ఏదీ?

- వడగళ్ల వానతో వరి పంటకు నష్టం
- ఐదు నెలలుగా నిరీక్షిస్తున్న రైతులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



కథలాపూర్‌లో నష్టపోయిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు(ఫైల్)

కథలాపూర్: ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలో వడగళ్ల వానకు వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. వ్యవసాయ అధికారులు అప్పట్లో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి బాధిత రైతుల వివరాలు సేకరించారు. ఐదు నెలలు దాటినా ఇప్పటివరకు పరిహారం రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతు సంక్షేమ కోసం ప్రగల్భాలు పలుకుతున్న పాలకులు పరిహారం మంజూరు గురించి పట్టించుకునేవారు కరువయ్యారని బాధిత రైతులు మండిపడుతున్నారు.

మండలంలో 1,200 ఎకరాల్లో నష్టం

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలున్నాయి. ఆయా గ్రామాల రైతులు యాసంగిలో వరి పంటను సాగు చేయగా.. మార్చి, ఏప్రిల్ నెలలో పంట ఎదిగి చేతికొచ్చే సమయంలో ఈదురుగాలులు, వడగళ్ల వర్షం కురిసింది. వరి పంట నేలవాలగా.. వరి గింజలు రాలిపోయినట్లు రైతులు తెలిపారు. చేతికందే సమయంలో వడగళ్ల వర్షం తమకు నష్టం చేసిందని రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. దిగుబడి రాక పోక పెట్టుబడి కూడా చేతికందని పరిస్థితుల్లో ఉండిపోయామని నష్టపోయిన రైతులు వాపోతున్నారు. మండలంలో 1,200 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగినట్లు అధికారులు నివేదిక పంపారు. ఎకరానికి రూ. 10 వేలు పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు కాస్తా ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటికీ దిక్కులేదని రైతులు పేర్కొన్నారు. రైతుబంధు పథకం కింద పెట్టుబడి సాయం అందిస్తున్నంత మాత్రాన పంట నష్టపోయిన సమయంలో ప్రభుత్వం ఆదుకునేందుకు ముందుకు రాకపోవడం దారుణమని రైతు సంఘాల నేతలు మండిపడుతున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చొరవ చూపి వడగళ్ల వల్ల వరిపంట నష్టపోయిన రైతులకు పరిహారం త్వరగా చెల్లించాలని మండల రైతులు కోరుతున్నారు.

సాగుచేసి నష్టపోయా



యాసంగిలో 4 ఎకరాల్లో వరి పంట సాగుచేసిన. పంట ఎదిగిందని సంతోష పడిన. కొన్నిరోజుల్లో వరిపంటను కోయాలని అనుకున్నా. అంతలోనే వడగళ్ల వర్షం కురిసి పంట నేలవాలింది. వరి గింజలు రాలిపోయాయి. వడగళ్లతో లక్ష నష్టం జరిగింది. ప్రభుత్వం రైతులకు పరిహారం త్వరగా ఇవ్వాలి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పరిహారం ఇప్పించేందుకు కృషి చేయాలి.

– ముంజ లస్మయ్య, రైతు, బొమ్మెన

నిర్లక్ష్యం వద్దు



ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతే పంటల బీమా పథకంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాల్సి ఉండగా.. రాష్ట్రంలో పంటల బీమా పథకం అమలు చేయడంలేదు. ఫలితంగా రైతులకు నష్టం జరిగినప్పుడు పరిహారం రాని పరిస్థితి. యాసంగిలో వరి పంటకు నష్టం జరిగితే ఇప్పటికి పరిహారం ఇవ్వకపోవడం దారుణం. వడగళ్లతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 20 వేలు పరిహారం చెల్లించాలి.

– పిడుగు ప్రతాప్‌రెడ్డి, బీజేపీ మండల ప్రధానకార్యదర్శి

ప్రభుత్వానికి నివేదించాం



మార్చి, ఏప్రిల్ నెలలో కథలాపూర్ మండలంలో 1,200 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగినట్లు నివేదిక తయారు చేసి ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదించాం. వడగళ్ల వర్షం కురిసిన మరుసటి రోజు ఏఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టం వివరాలు తయారు చేశారు. ప్రభుత్వం నుంచి పరిహారం మంజూరు కాగానే రైతుల ఖాతాలో జమ చేస్తాం.

– యోగితా, మండల వ్యవసాయ అధికారి, కథలాపూర్

పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలి





సారంగాపూర్, ఇబ్రహీంపట్నంలో మొక్కలు నాటిన అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు

రాయికల్: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని అన్నారు. శనివారం రాయికల్ మండలంలోని 32 గ్రామాల్లో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్, భూషణరావుపేట, పోతారం గ్రామాల్లో ఎంపీపీ జవ్వాజి రేవతి శనివారం మొక్కలు నాటారు. ప్రతీ గ్రామంలో వెయ్యి మొక్కలు నాటించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో జనార్దన్, ఈసీ లక్ష్మయ్య, సర్పంచులు పోతు సింధూజ, కూన సులోచన,జలందర్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: పల్లెలు పచ్చదనంతో కనువిందు చేయాలనే కోటి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మెట్‌పల్లి ఎంపీపీ మారు సాయిరెడ్డి అన్నారు. మండలంలోని జగ్గసాగర్,మెట్లచిట్టాపూర్ గ్రామాల్లో శనివారం ప్రజాప్రతినిధులు,అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో భీమేశ్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో శనివారం కోటి మొక్కల వృక్షార్చనలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, వివిధ శాఖల సిబ్బంది ప్రతి గ్రామానికి వెయ్యి మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ సతీష్, సర్పంచ్ గుర్రాల రాజేంధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూర్: స్వాతంత్ర్య భారత వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా వెల్గటూర్ మండలం రాంనూర్‌లో మెగా ప్లాంటేషన్ చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడుక మంజుల, ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, జెడ్పీటీసీ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి, గోధూర్ గ్రామంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, ఎస్ఐ ఉమసాగర్, సర్పంచు సున్నం నవ్యశ్రీ, ఏపీవో వినోద్, నాయకులు పాల్గొన్నారు.

పెగడపల్లి: పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం హరితహారంలో భాగంగా స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులు, సిబ్బందితో కలిసి ఎస్సై మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఏఎస్సై సత్తయ్య, హెచ్‌సీ రవీందర్, పీసీలు పాల్గొన్నారు.

ధర్మపురి : మొక్కలు నాటి పచదనాన్ని పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ అన్నారు. శనివారం ధర్మపురి పట్టణంలో వెయ్యి మొక్కలను నాటారు. కార్యక్రమంలో, కమెడియన్ సదయ్య, మున్సిపల్ కమిషనర్ రమేశ్, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ బత్తిని అరుణ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

అర్హుల పేర్లు నమోదు చేయించాలి



ఓటరు నమోదు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ, తహసీల్దార్

పెగడపల్లి: అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని జెడ్పీటీసీ రాజేందర్‌రావు, తహసీల్దార్ ఎం.ఏ ఫరూక్ బీఎల్వోలకు సూచించారు.మండలంలోని ఎల్లాపూర్, మ్యాకవెంకయ్యపల్లి, నర్సింహునిపేట, నామాపూర్ గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను సందర్శించి మాట్లాడారు. ఈ నెల 27, సెప్టెంబర్ 2, 3, తేదీల్లో ఓటరు నమోదు కోసం ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు ర్కొన్నారు. కార్యక్రమాల్లో సర్పంచులు అంజమ్మ, లక్ష్మి, కరుణాకర్‌రెడ్డి, బాబుస్వామి, డీటీ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన యువత ఓటర్‌గా నమోదు చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం: 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ప్రసాద్ కోరారు. ఇబ్రహీంపట్నం, అమ్మక్కపేట, డబ్బా, ఎర్రాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఓటర్ నమోదు కార్యక్రమాన్ని శనివారం పరిశీలించి మాట్లాడారు. ఆదివారం కూడా మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని కొత్తగా ఓటర్ నమోదు , తప్పుఒప్పులు ఉంటే సవరణ చేసుకోవాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆర్ఐలు రమేశ్, గంగాధర్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

వెల్గటూర్: మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో ఎండపల్లి మండలానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరైందని ఎండపల్లి సర్పంచ్ మారం జలంధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కూడలి వద్ద గ్రామస్తులతో కలిసి సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్‌ల చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం మంజూరుతో మండల ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువవుతాయని, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సింహాచలం జగన్, ఏలేటి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గూడ రాంరెడ్డి, ఉప సర్పంచ్ మైలారపు సతీష్, రైతు విభాగం మండల అధ్యక్షులు మారం జగన్మోహన్‌రెడ్డి,గ్రామస్తులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు అప్పగింత

కథలాపూర్: మేడిపెల్లి మండలం వల్లంపెల్లి గ్రామానికి చెందిన పస్తం సంజీవ్, జగిత్యాల రూరల్ మండల వెల్దుర్తి గ్రామానికి చెందిన సౌజన్య సెల్‌ఫోన్లు పోగొట్టుకోగా.. పోలీసులు రికవరీ చేసి అప్పగించారు. ఈ మేరకు శనివారం కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ చేతులమీదుగా వారికి ఫోన్లను అప్పగించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. సీఈఐఆర్ యాప్‌తో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను గుర్తించామని ఎస్సై పేర్కొన్నారు.

రమేశ్‌బాబును కలిసిన ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: రాష్ట్ర వ్యవసాయ రంగ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబును శనివారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కలిసి అభినందనలు తెలిపారు. ఆయన వెంట మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, రాష్ట్ర టెక్స్‌టైల్స్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మాజీ జెడ్పీటీసీ కుమార్ ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత

గొల్లపల్లి: మండల కేంద్రానికి చెందిన జక్కుల గంగయ్య గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు పరిస్థితి వివరించడంతో రూ.1.25 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేశారు. ఈ మేరకు శనివారం గొల్లపల్లి వైస్ ఎంపీపీ ఆవుల సత్యం చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

కలెక్టర్‌కు సన్మానం

కోరుట్ల: లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల కోటి నవదుర్గ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషాను శనివారం కలెక్టర్ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల కోటి నవదుర్గ అధ్యక్షురాలు వనపర్తి రమ్య, కార్యదర్శి కుందారపు ప్రేమలత, రాధిక, క్లబ్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సంజయ్‌కుమార్ గెలుపు కోసం కృషి చేయాలి

రాయికల్:సంజయ్‌కుమార్ గెలుపు కోసం యువకులు కృషి చేయాలని యూత్ అధ్యక్షుడు పాలకుర్తి వెంకటేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం ఒడ్డెలింగాపూర్ గ్రామంలో యువకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేపై ప్రతిపక్ష నాయకులు చేస్తున్న ఆరోపణలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. సమావేశంలో సర్పంచ్ పాలకుర్తి రవి, మండల యూత్ నాయకులు అభికృష్ణ, నవీన్, రాకేశ్, రమేశ్, అజయ్, వినయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

రాయికల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై అజయ్ అన్నారు. శనివారం రాయికల్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో అంగడిలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మేరకు ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, నంబరు ప్లేట్ సరిగా లేని, రిజిస్ట్రేషన్ చేయని 16 ద్విచక్ర వాహనాలను జప్తు చేశారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఆశ కార్యకర్తల నిరసన



రాయికల్‌లో మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ కార్యకర్తలు

రాయికల్/కథలాపూర్/మల్లాపూర్/పెగడపల్లి/ధర్మపురి: ఆశ కార్యకర్తల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, దీనికి నిరసనగా శనివారం జిల్లా వ్యాప్తంగా ఆశ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. రూ. 18 వేలు వేతనం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు

మెట్‌పల్లి: హరితహారంలో మొక్కలు నాటి వాటి సంరక్షణపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. పట్టణంలోని అర్బన్ కాలనీలో శనివారం వెయ్యి మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. హరితహారంతో రాష్ట్రంలో పచ్చదనం వెల్లివిరుస్తుందన్నారు. హరితహారంలో ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములవుతున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

కోరుట్ల రూరల్: మండలంలోని జోగిన్‌పెల్లి– కల్లూర్ గ్రామాల మధ్య లింకు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి ఈజీఎస్ నిధులు రూ. 1 కోటి మంజూరయ్యాయి. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్‌విండో చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

హామీలు మరిచిన బీఆర్ఎస్ సర్కారు

- యావత్మల్ ఎమ్మెల్యే మదన్ ఎర్వార్



మాట్లాడుతున్న యావత్మల్ ఎమ్మెల్యే మదన్ ఎర్వార్

కోరుట్ల: బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరిచి కుటుంబ పాలనతో కాలం గడుపుతోందని మహారాష్ట్ర యావత్మల్ ఎమ్మెల్యే మదన్ ఎర్వార్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, దళితులను 3 ఎకరాలు, నిరుద్యోగ భృతి వంటి హామీలు నీరుగారిపోయాయన్నారు. రాష్ట్రంలో, కోరుట్ల సెగ్మెంట్‌లోనూ కుటుంబ పాలన కొనసాగు తోందన్నారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ తెరిస్తామని చెప్పి పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. భారతదేశాన్ని ప్రపంచానికే విశ్వగురుగా మార్చడంలో బీజేపీ పాత్ర మరవలేనిదన్నారు. కోరుట్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో రానున్న ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు సురభి నవీన్‌కుమార్, సెగ్మెంట్ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, సాంబార్ ప్రభాకర్, జెఎన్. సునీత, బీజేపీ పట్టణ అధ్యక్షుడు దాసరి రాజశేఖర్, పార్లమెంట్ కో కన్వీనర్ సదాశివ్, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి బాబు, అధికార ప్రతినిధి ఇందూరి తిరుమలవాసు, కౌన్సిలర్ మాడవేని నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ గెలిచే విధంగా కార్యకర్తలు కష్టపడాలి

కొండగట్టు: రాష్ట్రంలో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడాలని కర్ణాటక ఎమ్మెల్యే బసవరాజ్ ముతిముద్ అన్నారు. శనివారం కొడిమ్యాలలో నిర్వహించిన ప్రవాస్ యోజన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బూత్ స్థాయిలో పార్టీనీ పటిష్టం చేసి వచ్చేఎన్నికల్లో చొప్పదండి నియోజకవర్గంలో బీజేపీని గెలిపించేలా కృషి చేయాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ, నాయకులు రవీందర్ రెడ్డి, ప్రభాకర్ యాదవ్, శ్రావణ్‌కుమార్, గోల్కొండ రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'మార్కెట్ యార్డులో మొక్కలు నాటితే రైతులకు ఇబ్బంది'

రాయికల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో అరకొరగా ఉన్న స్థలంలో అధికారులు ఒకే చోట మొక్కలు నాటే కార్యక్రమం రూపొందించడంతో రైతులకు ఇబ్బంది పడతారని, 8వ వార్డు కౌన్సిలర్ కల్లెడ సునీత, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి అన్నారు.దీనిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్‌గా రమేశ్

కొండగట్టు: చొప్పదండి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్‌గా కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన మొగిలిపాలెం రమేశ్‌ను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నియమించారు. శనివారం బూరుగుపల్లిలో ఎమ్మెల్యే నియామక పత్రం అందించారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ గెలుపునకు కృషి చేస్తానని రమేశ్ తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే, నాయకులు పునుగోటి కృష్ణారావు మేనేని రాజనర్సింగరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

మల్లాపూర్: మండల కేంద్రంలోని గిరిజన బాలికల మినీ గురుకుల పాఠశాలలో ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పథకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరోగ్యశ్రీ టీంలీడర్ సురేశ్ ఆదేశాల మేరకు మండల ఆరోగ్య మిత్ర సభ్యుడు అంజనేయులు శనివారం పలు అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రియాంక, టీచర్లు పాల్గొన్నారు.

సారగమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

కథలాపూర్: మండలంలోని పోసానిపేటలో సారగమ్మ ఆలయ నిర్మాణానికి శనివారం ప్రజాప్రతినిధులు భూమిపూజ చేశారు. గ్రామస్తుల సహకారంతో ఆలయం నిర్మిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం. జీ రెడ్డి, ఉపసర్పంచ్ బత్తుల అశోక్, అర్చకులు లక్ష్మణ్‌చారీ, వార్డుసభ్యులు, కులసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వర్షకొండ పాఠశాలలో మాక్ పోలింగ్

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా విద్యార్థులతో మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. విద్యార్థులు ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, పీడీ క్రిష్ణప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

రాయికల్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంఈవో గంగాధర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న మండలస్థాయి ఎస్జీఎఫ్ క్రీడలు శనివారం ముగిశాయి.క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహ దారుఢ్యానికి ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం విజేతలకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నాయకులు రాంరెడ్డి, మ్యాకల రమేశ్, కొమ్ముల ఆదిరెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్, శేఖర్, నరేశ్, పీఈటీలు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం

ధర్మపురి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో శనివారం . చైర్మన్ అయ్యోరి రాజేష్ అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. 2023 మే 1 నుండి జులై నెల వరకు సంబంధించిన ఆదాయ, వ్యయాలు, నాబార్డు గోదాముల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, పాలకవర్గ సభ్యులు లక్ష్మి, రాజమల్లయ్య, బొల్లం హరి, పాయల్ శ్రీనివాస్, గైని మల్లేశం, మామిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోస్టాఫీస్ సేవలపై విద్యార్థులకు అవగాహన

సారంగాపూర్: పోస్టాఫీసులు అందిస్తున్న వివిధ పథకాలపై బీర్‌పూర్ మండలం కొల్వాయి జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి నెల 4 శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమంలో భాగంగా పోస్టాఫీస్‌లు ఏర్పడినప్పటి నుంచి ప్రస్తుతం మారిన సాంకేతికతతో పోటీ పడుతూ ప్రజలకు అందిస్తున్న సేవలు, పథకాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సిరుప నాగభూషణం, విద్యార్థులు, బ్రాంచ్ పోస్టాఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత బీపీ,షుగర్ క్యాంపు ఏర్పాటు

మల్లాపూర్: మదర్‌థెరిస్సా పుట్టినరోజు సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మల్లాపూర్‌లో శనివారం బీపీ,షుగర్ క్యాంపింగ్ నిర్వహించారు. సుమారు 100 మందికి పైగా బీపీ,షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కనుక సంజీవ్, రీజియన్ అధ్యక్షుడు రాంప్రసాద్, సభ్యులు సతీశ్, మహేశ్, రమేశ్ పాల్గొన్నారు.

గోశాలకు ఆర్థికసాయం

రాయికల్: పట్టణంలోని విశ్వశాంతి పాఠశాల కరస్పాండెంట్ మచ్చ గంగాధర్ – లలిత దంపతుల కుమారుడు విద్యాన్వేష్ జన్మదినం సందర్భంగా శనివారం శివాలయంలో నిర్మిస్తున్న గోశాలకు రూ.10 వేల ఆర్థికసాయం అందజేసినట్లు ఆలయ పూజారి శివలింగం తెలిపారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌లో శనివారం యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు రవి, బలరాం రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చీడపీడల యజమాన్యంపై రైతులకు వివరించారు. గ్రామ ఇన్‌చార్జి డాక్టర్ రజినిదేవి, ఏఈవో సుమలత పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం : మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో గణితం సబ్జెక్ట్ బోధించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ పూర్తి చేసిన వారు దరఖాస్తులను మోడల్‌స్కూల్‌లో అందచేసి సంప్రదించాలని పేర్కొన్నారు.